## ఓయూ వీసీకి సీవీ రామన్ ఎక్సలెన్సీ అవార్డు



ప్రొఫెసర్ కుమార్, ఓయూ వీసీ

అబిడ్స్, ఫిబ్రవరి 26: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ అడ్మినిస్ట్రేటర్, సివిల్ ఇంజినీర్ నిపుణుడు, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ కు ఈ సంవత్సరం సర్ సీవీ రామన్ ఎక్సలెన్సీ అవార్డు 2025 కు ఎంపిక చేసినట్టు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న అవార్డును ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో ప్రధానం చేస్తారని తెలిపారు. ప్రొఫెసర్ కుమార్ సేవలను గుర్తించి ఆయనకు అవార్డును ప్రదానం చేస్తున్నట్టు నారాయణ తెలిపారు.

# రేషన్ కార్డులు ఎప్పుడిస్తారు?



**వరుస ప్రకటనలతో అయోమయం**
**తాజాగా మార్చి 1 నుంచి పంపిణీ అంటూ.. ప్రకటన**
**సమాచారం లేదన్న అధికారులు**
**జిల్లాలో లక్షా 25,600 దరఖాస్తులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం రోజుకో ప్రకటనతో ప్రజలను ఊరిస్తున్నది. తాజాగా మార్చి 1న ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంపిణీ చేస్తామని ప్రకటించారు. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులకు మాత్రం ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ ప్రకటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రకటించారు. 15 నెలలు దాటుతున్నా నేటికీ దరఖాస్తుల స్వీకరణతోనే కాలయాపన చేస్తుండటంతో తాజా ప్రకటనతోనూ లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. అంతేగాకుండా తమను మభ్యపెట్టడానికే సాగదీస్తున్నారని అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ మార్చి 1 నుంచి పంపిణీ ప్రారంభిస్తే.. రేషన్ కార్డుల అప్లికేషన్లలోని సమస్యలు పరిష్కరించకుండా ఎవరికి? ఏ ప్రాతిపదికన ఇస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి.

### పరిశీలన దశలోనే అప్లికేషన్లు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రేషన్ కార్డుల కోసం అర్హులు నాలుగు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. తొలుత ప్రజా పాలనలో, రెండోసారి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ప్రజావాణిలో చేసుకున్నారు. చివరగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో అటువైపు పరుగులు తీశారు. ఇలా పలు సార్లు చేసిన దరఖాస్తులు ఈ నెల 25 నాటికి లక్షా 25,600 దరఖాస్తులు అందాయి. పౌర సరఫరాల శాఖ అధికారులు వచ్చిన దరఖాస్తులను వచ్చినట్లుగా పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నారు. అయినా ఈ ప్రక్రియ పూర్తవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ తరుణంలో ప్రభుత్వం మార్చి నుంచి ఎంత మందికి పంపిణీ చేస్తుందో? ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకొని పంపిణీ చేస్తుందనే ప్రశ్నలు తలెత్తున్నాయి.

### కొంత మంది ఇండ్లకు వెళ్లని సర్వే అధికారులు

జీహెచ్ఎంసీ, పౌర సరఫరాల, రెవెన్యూ శాఖల అధికారులు హైదరాబాద్ వ్యాప్తంగా సర్వే చేసి అర్హులను గుర్తించారు. సంబంధిత నివేదికను కూడా జిల్లా సివిల్ సప్లై శాఖ కార్యాలయంలో సమర్పించారు. కానీ కొంత మంది దరఖాస్తుదారులు తమ ఇండ్ల వద్దకు సర్వే అధికారులు రాలేదని చెబుతున్నారు. అయితే వెరిఫికేషన్ కాని వారికి రేషన్ కార్డులు వస్తాయా? రావా? అనే ఆందోళనలో దరఖాస్తుదారులు ఉన్నారు. సర్వే పూర్తి కాకముందే అధికారులు నివేదిక సమర్పించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రాతిపదికన సర్వే చేశారో అర్థం కాక సతమతమవుతున్నారు. తమ ఇంటికి సర్వేకు కూడా రాకముందే రేషన్ కార్డులను ఎలా పంపిణీ చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దీన్ని బట్టి రేషన్ కార్డుల పంపిణీలో ప్రభుత్వానికే స్పష్టత లేదని విమర్శిస్తున్నారు. అర్హులను గుర్తించడంలో నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా ఎలా పంపిణీ చేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్పష్టత ఇవ్వని ప్రభుత్వం.. అయోమయంలో అర్హులు

రేషన్ కార్డుల పంపిణీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే గందరగోళం నెలకొంది. దరఖాస్తు ప్రక్రియ, అర్హులను గుర్తించడం, దరఖాస్తుల స్వీకరణలో నేటికీ ప్రభుత్వానికి స్పష్టత లేదని హైదరాబాద్ ప్రజలు విమర్శిస్తున్నారు. రోజుకో ప్రకటన, పద్ధతి లేకుండా దరఖాస్తుల స్వీకరణతో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విషయం తేలిపోయిందని దరఖాస్తుదారులు బాహాటంగానే పేర్కొంటున్నారు. మరోవైపు దరఖాస్తుల స్వీకరణలో మీసేవ నిర్వాహకులకు సరైన గైడ్ లైన్స్ ఇవ్వకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోతున్నారు. అటు పౌర సరఫరాల శాఖ అధికారులకు కూడా కొత్తవారి చేరిక, పాతవారి తొలగింపుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఈ గందరగోళ పరిస్థితుల్లో మార్చి 1 నుంచి రేషన్ కార్డుల జారీ సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సరైన మార్గదర్శకాలు జారీ చేసి అసలైన అర్హులను గుర్తించి రేషన్ కార్డులను జారీ చేయాలని నిరుపేదలు కోరుతున్నారు.

## ఐసీఎస్ఐ ఫలితాల్లో నగర విద్యార్థులకు ర్యాంకులు





తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) గత డిసెంబర్‌లో నిర్వహించిన కంపనీ సెక్రటరీ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సీఎస్ మంజీత్ బుచా తెలిపారు. అఖిల భారత స్థాయిలో జరిగిన పరీక్షల్లో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం నుంచి పరీక్షకు హాజరైన వారిలో నగరానికి చెందిన గుంజన్ అగర్వాల్ 12వ ర్యాంకు, వింధ్య కృష్ణ చల్లా 2వ ర్యాంకు సాధించినట్లు ఆయన వెల్లడించారు. వివరాలకు వెబ్‌సైట్ www.icsi.edu సందర్శించవచ్చని తెలిపారు. కంపనీ సెక్రటరీస్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ తదుపరి పరీక్షలు జున్ 1 నుంచి 10వ తేదీవరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష రుసుమును ఫిబ్రవరి 26 నుంచి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు.

## ఫెస్టివల్ ముగిసినా.. ఆర్గానిక్ పేరుతో అదనపు ధరలు



వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: డాక్టర్ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ద్రాక్ష ఫెస్టివల్ ముగిసినా.. బయటి నుంచి తీసుకువచ్చిన ద్రాక్షను క్షేత్రశాల వద్ద పెట్టి దళారీలు విక్రయిస్తున్నారనే ఆరోపనలున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా అధికారులు దాట వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 17న ద్రాక్ష ఫెస్టివల్‌ను వీసీ రాజిరెడ్డి ప్రారంభించగా.. గత ఆదివారంతో ముగిసింది. అయినా అదే పేరుతో స్టాల్‌ను కొనసాగిస్తున్నారు. కిలో రూ.400 వరకు విక్రయిస్తున్నారు. ఫెస్టివల్ ముగిసినా ఎందుకు విక్రయాలు జరుపుతున్నారని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎల్బీనగర్, హయాత్‌నగర్, హైటెక్ సిటీ, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సేంద్రియమంటూ చెప్పగానే కొనుగోలు చేస్తున్నారు. పరిశోధనా కేంద్రం సమీపంలో పండించిన 40 రకాల పండ్లను ఇంకా ప్రదర్శనలో ఉంచారని కొనుగోలుదారులు నమ్మడం దళారీలకు కలిసొస్తున్నది. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సికింద్రాబాద్‌లోని గణేశ్ ఆలయంలో శివరాత్రి సందర్భంగా అభిషేకం చేస్తున్న పురోహితుడు



మహాశివరాత్రి సందర్భంగా కూకట్‌పల్లి రామలింగేశ్వర స్వామి ఆలయం, ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కె.నవీన్‌కుమార్



భవానీ శంకర ఆలయంలో కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరులు



ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్ భవానీ శంకర ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు కుటుంబ సమేతంగా వస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

# విజయ బ్రాండ్ కాపీ చేయడం నేరం

**వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి: ఫెడరేషన్ చైర్మన్**

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (టీజీడీడీసీఎఫ్) విజయ బ్రాండ్ కాపీ చేసి వాడడం నేరమని ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి చెప్పారు. విక్రేతలు, వినియోగదారులు గమనించాలని సూచించారు. లాలాపేటలోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీ చట్టం 1964 ప్రకారం ఫెడరేషన్ ప్రారంభమైందని చెప్పారు. 2014 ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం విభజన జరిగినప్పటి నుంచి రెండు రాష్ట్రాల్లో వేర్వేరుగా ఫెడరేషన్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. విజయ బ్రాండ్ ఇప్పటికీ ఉమ్మడి హక్కుగానే ఉందని, మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ ప్రకారం స్వయం ప్రతిపత్తితో పనిచేస్తున్న జిల్లాల పాల యూనియన్లు బ్రాండ్‌ను వినియోగించుకోవడానికి వీల్లేదన్నారు. ఏ జిల్లా యూనియన్లకు సైతం అనుమతిలేదని ఏపీ డెయిరీ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ అధికారులు రాతపూర్వకంగా స్పష్టం చేశారన్నారు. కానీ కొన్ని జిల్లా యూనియన్లు చట్ట విరుద్ధంగా బ్రాండ్‌ను వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి




విజయ బ్రాండ్ ను వినియోగించుకుంటూ మార్కెట్లో ఉన్న ఇతర కంపెనీల పాలు

## సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించాం..

ఈ విషయమై సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించగా ఏ ఉత్పత్తులను తయారు చేయడం, విక్రయించడం చేయకూడదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇప్పటివరకు కర్నూలు జిల్లా పరస్పర సహాయ సహకార సంఘం, వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణా జిల్లా పాల ఉత్పత్తి పరస్పర సహకార సంఘం, శ్రీసాయి దుర్గ ఎంటర్ప్రైజెస్, నెల్లూరు జిల్లా పరస్పర సహకార పాల ఉత్పత్తి యూనియన్ లిమిటెడ్, ఆల్ రిచ్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఎస్ఆర్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, విజయ మిల్క్ ప్రొడక్ట్స్, నార్మల్ మదర్ డెయిరీ సంస్థలు విజయ బ్రాండ్‌ను అక్రమంగా వాడుకుంటున్నాయని తమ దృష్టికి వచ్చిందని వివరించారు. వినియోగించే వారు చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. విజయ బ్రాండ్‌ను వినియోగించుకుంటున్న ఇతర సంస్థల వల్ల ప్రజలు తమపై పెంచుకున్న విశ్వాసానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రైవేటు డెయిరీలు నాణ్యత పాటించకుండా పాలు, ఇతర పాల ఉత్పత్తులను రూపొందించే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రజలు జాగ్రత్తతో విజయ తెలంగాణ బ్రాండ్‌ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వినియోగదారులు, విక్రేతలు, పంపిణీ దారులు విజయ తెలంగాణ పాలు, ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల పాడి రైతులకు మద్దతు ఇవ్వడమే కాకుండా రాష్ట్ర డెయిరీ రంగ అభివృద్ధికి తోడ్పడుతూ, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందించినవారిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా 91211 60569 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## వడ్లకొండ కృష్ణ హంతకులను కఠినంగా శిక్షించాలి

**రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు స్కైలాబ్, చెన్నయ్య తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 26: వడ్లకొండ కృష్ణ హంతకులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అతని కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఐక్య ఉద్యమ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నందుకు వడ్లకొండ కృష్ణ( మాల బంటి) కుటుంబానికి న్యాయం జరిగే దాకా పోరాడుదాం అనే నినాదంతో దళిత బహుజన, మహిళ, విద్యార్థి ప్రజా సంఘాల నేతృత్వంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కుల నిర్మూలనా పోరాట సమితి ( కేఎన్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినవ్ బూరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు బి.చెన్నయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏసు రత్నం, మారుపాక అనిల్ కుమార్, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేసు విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి అంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సూర్యపేటలో ఒక భారీ ఆత్మగౌరవ బహిరంగ సభ జరపాలని అన్నారు. ఎస్సీ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ తీర్మానం చేయించే విధంగా వారిపై ఒత్తిడి తెస్తామన్నారు. వడ్ల కొండ కృష్ణ భార్య భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వడ్లకొండ కృష్ణ భార్య భార్గవి, తండ్రి డేవిడ్, చైతన్య మహిళా సంఘం నేత జయ, చంద్రప్ప, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైదులు, స్వరూప, అనూష , ఎండీ వహీద్, డీఎల్ క్రిష్ణ చంద్, శంకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## గంగిరెద్దుకు క్యూఆర్ కోడ్



గంగిరెద్దుకు తగిలించి ఉన్న క్యూఆర్ కోడ్

మేడ్చల్, ఫిబ్రవరి 26: దేశం డిజిటల్ ఇండియాగా మారిపోయింది. ఎవరూ కూడా జేబులో ఫోన్ తప్ప, డబ్బులు పెట్టుకొని వెళ్లడం లేదు. రూ.10 పెట్టి టీ తాగినా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్నారు. ఇది యాచకులకు ఇబ్బందిగా మారింది. దానం చేసే గుణం ఉన్నా జేబులో డబ్బులు లేకపోవడంతో దానం చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లోని శివాలయానికి శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గంగిరెద్దును తీసుకువచ్చిన వ్యక్తి క్యూఆర్ కోడ్‌ను గంగిరెద్దు ముఖానికి తగలించాడు. ఆలయం నుంచి బయటికి వస్తున్న భక్తులకు గంగిరెద్దుతో దీవెనలు ఇప్పిస్తూ చేతిలో నగదు లేకపోతే ఆన్‌లైన్‌లో డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు ఒకింత ఆశ్చర్యానికి గురవడంతోపాటు డిజిటల్ ఇండియా మహత్యం అని చర్చించుకోవడం కన్పించింది.

## కేంద్రం సమగ్ర కులగణన చేపట్టాలి



హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ధనంజయ నాయుడు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి26: దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించి, విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తిచేసి అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు. జనాభా దామాషా ప్రకారం చట్ట సభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై ఈ నెల 28న హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, నేత సురేష్ పాల్గొన్నారు.

## న్యాయం కావాలని నిరసన




రవీంద్రభారతి, ఫిబ్రవరి26: తనకు న్యాయం కావాలని బాధితుడు కెవిన్ ఎడ్వర్డ్స్ రాష్ట్ర డీజీపికి, మానవ హక్కుల కమిషన్, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు విజ్ఞప్తి చేశారు. ఏడాది కింద తీసుకున్న రెండు లాబ్‌టాప్‌లు, ఫోన్లు దౌర్జన్యంగా పోలీసులు తీసుకున్నారని ఆరోపించారు. తనపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. బుధవారం కెవిన్ ఎడ్వర్డ్స్ చిక్కడపల్లి పోలీసుల ఎదుట తమ నిరసన తెలియజేస్తూ తన రెండు లాఫ్‌టాప్‌లు, ఫోన్లు దైర్జన్యంగా తీసుకోవడం వల్ల నా ఉద్యోగం కూడా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అక్రమంగా తీసుకున్న ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు ఇవ్వాలని ఎన్ని మార్లు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించకోలేదని చెప్పారు. పోలీసుల చేసిన నిర్వాకం వల్ల నా ఉద్యోగం పోయి బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను కూడా చెల్లించలేకపోతున్నానని, రుణం కట్టలేదని తన ఇంటిపై బ్యాంకు రుణ రికవరీ ఏజెంట్లు దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కెవిన్ తల్లిదండ్రుల మీద కూడా తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారని వెల్లడించారు. ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు తిరిగి చెల్లించాలని హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయడం జరిగిందని బాధితుడు వివరించారు. ఇప్పటికైనా చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఎస్‌హెచ్ఓ రాజునాయక్ తక్షణమే స్పందించి లాప్‌ట్యాప్‌లు, ఫోన్లు తిరిగి ఇవ్వాలని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కెవిన్ కోర్తున్నాడు. పోలీసులు స్పందించకుంటే ప్రజాసంఘాలతో కలిసి పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

## యాదాద్రి అఖండ జ్యోతి రథయాత్ర ప్రారంభం



అఖండ జ్యోతి యాత్రను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కాచిగూడ కార్పొరేటర్, తదితరులు

కాచిగూడ, ఫి బ్రవరి 26: యాదాద్రి అఖండ జ్యోతి రథయాత్ర హిందూ మతానికి ప్రతీకగా నిలుస్తుందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం బర్కత్పురాలోని యాదాద్రి భవన్ వద్ద లక్ష్మీనరసింహస్వామి అఖండ జ్యోతి ప్రచార యాత్రను కాచిగూడ కార్పొరేటర్ ఉమతో కలిసి ఆయన ప్రారంభించారు. యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో 31లేండ్లుగా యాత్రన నిర్వహిస్తున్నారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ తిరుపతి లాగే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిలుస్తుందని పేర్కొన్నారు. యాదాద్రి వరకు మెట్రో రైలుకు కేంద్రం అనుమతించిందని, ప్రస్తుత రైల్వే బడ్జెట్లో అధిక నిధులు కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావు, రమేష్ యాదవ్, ఎమ్మెస్ ధరణి, బుచ్చిరెడ్డి, చంద్రశేఖరరావు, దిద్ది బాలాజీ, సత్యనారాయణ గౌడ్, లక్ష్మారెడ్డి, ఉపేందర్ రావు, పవన్ కుమార్, సుదీష్ కుమార్, గణపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### జయజయ ధ్వానాలతో భక్తుల స్వాగతం

చిక్కడపల్లి: అఖండ జ్యోతి యాత్రకు భక్తులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. చిక్కడపల్లి ప్రధాన రహదారికి యాత్ర చేరుకోగానే వందలాదిమంది భక్తులు రథానికి ఎదురేగి జయజయ ధ్వానాలతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను నిర్వాహకులు అందించారు.

## చికెన్, కోడిగుడ్లతోనే పోషక విలువలు



ప్రోటీన్ దినోత్సవంలో పాల్గొన్న పౌల్ట్రీ ఇండియా, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: భారతీయుల్లో 73 శాతం మంది ప్రజలు ప్రొటీన్ లోపంతో బాధపడుతున్న తరుణంలో అత్యధికంగా ప్రొటీన్‌ను అందించే చికెన్, కోడిగుడ్డును ఆహారంలో తప్పనిసరిగా వాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పౌల్ట్రీ ఇండియా, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎమ్‌ఏ) అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ అన్నారు. ఫిబ్రవరి 27న ప్రపంచ ప్రోటీన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జూబ్లీహిల్స్‌లోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఉదయ్‌సింగ్ మాట్లాడుతూ ప్రొటీన్ లోపంతో ఏర్పడే తక్కువ బరువు. రక్తహీనత సమస్యలను చికెన్, కోడిగుడ్ల ద్వారా పూడ్చుకోవచ్చని పరిశోధనలు వెల్లడించాయన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచించిన జాబితా ప్రకారం శరీరబరువులో ప్రతి కిలోకు ఒక గ్రాము చొప్పున అందించాల్సి ఉంటుందన్నారు. ప్రోటీన్‌ను అతి తక్కువ ధరలో అందించే చికెన్, కోడిగుడ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. లేనిపోని భయాలతో తినడం తగ్గిస్తే ప్రోటీన్ లేమి సమస్యలు ఎక్కువవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూట్రిషనిస్ట్ పూజా ముఖీజా పాల్గొన్నారు.